


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

నిజామాబాద్
కామారెడ్డి



సోమవారం 23 డిసెంబర్ 2024 4 పేజీలు


### మెరుగైన వైద్యం,విద్య సంక్షేమ
# పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా
- క్యాన్సర్,వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్ లు ఏర్పాటు
- 10 లక్షల ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు

**సూర్య రెంజల్**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. ఆదివారం రెంజల్ మండల కేంద్రంలోని రూ. కోటి 56 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహా,ఎమ్మెల్యే మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను మంత్రి పరిశీలించారు.ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్యం, (మిగతా 2లో)



### నిజామాబాద్ జిల్లాను
# వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహా

- పీ.హెచ్.సీ, ఎం.సీ.హెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లకు ప్రారంభోత్సవాలు
- ఉమ్మడి జిల్లాలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష
- వచ్చే ఉగాది నాటికి పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆదేశం
- వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం
- మౌలిక సదుపాయాల మెరుగుదలకు తక్షణ మంజూరీలు ఇస్తామని వెల్లడి
- విధులను విస్మరించి ప్రైవేట్ క్లినిక్ లు నిర్వహిస్తే ఉపేక్షించబోమని స్పష్టీకరణ

**సూర్య నిజామాబాద్ ప్రతినిధి**

ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ నిజామాబాద్ జిల్లాను వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహా వైద్యాధికారులకు హితవు పలికారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూ. 38.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎం.సీ.హెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ప్రారంభోత్సవాలు చేశారు. అందుబాటులోకి వచ్చిన నూతన వైద్య సేవలను పరిశీలించి, వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కోటీ 56 లక్షల రూపాయల వ్యయంతో రెంజల్ మండల కేంద్రంలో (మిగతా 2లో)



# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వెంకటస్వామి (కాకా) వర్ధంతి నిర్వాహణ

**సూర్య నిజామాబాద్ ప్రతినిధి**



నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సి.హెచ్. సింధూశర్మ, ఐ.పి.యస్ ఆదేశాల మేరకు నిజామాబాద్ కమీషనరేటు కార్యాలయంలో నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్ ) జి. బస్వారెడ్డి కీ.శే. వెంకటస్వామి ( కాకా ) వర్ధంతి నిర్వహించడం జరిగిందిలి.ఈ సందర్భంగా అదనపు డి.సి.పి (అడ్మిన్) మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిని నిలిపారని, పేదల పెన్నిదిగా పేరు గాంచారని తెలియజేశారు. భవిష్యత్ తరాలకోసం అనునిత్యం ప్రతిఒక్కరు కష్టపడాలని, భావి తరాల కోసం బంగారు బాట వేయాలని పోలీస్ శాఖ సిబ్బందికి అదనపు డి.సి.పి పిలుపునిచ్చారు.. ఈ వర్ధంతి సందర్భంగా సి. సి. ఆర్. బి ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్, ఎన్. ఐ. బి ఇన్స్పెక్టర్ ప్రసాద్ , రిజర్వు ఇన్స్ స్పెక్టర్ శ్రీ సతీష్ కుమార్, , శ్రీనివాస్, పోలీస్ కార్యాలయం సిబ్బంది , సి.సి.ఆర్.బి సిబ్బంది, సి.ఎస్.బి సిబ్బంది, ఐ.టి కోర్ సిబ్బంది ,కాంప్లెంటు సెల్ సిబ్బంది హాజరుకావడం జరిగింది. పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది సెంట్రల్ కంప్లైంట్ సెల్ సిబ్బంది హాజరుకావడం జరిగింది.

# కలెక్టరేట్లో అధికారికంగా జి.వెంకటస్వామి వర్ధంతి

**సూర్య నిజామాబాద్ ప్రతినిధి**

కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఆదివారం అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ముత్తెన్న, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. స్వర్గీయ వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెంకటస్వామితో తనకు గల అనుబంధాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వర్ధంతి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మెరుగైన వైద్యం,విద్య సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)



విద్య సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ముందుకు వెళ్ళటం జరుగుతుందన్నారు.ఆరోగ్య ఉప కేంద్రాలు, పీహెచ్సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను, జిల్లా ఆసుపత్రులను ఏర్పాటు చేస్తూ, పీ.హెచ్.సీలను సీ హెచ్ సీలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో ఇంకనూ 300 పైచిలుకు హెల్త్ సబ్ సెంటర్లు, 170 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ మారుమూల ప్రాంతాలతో పాటు ఆదివాసి ప్రాంతాలలో వీటి ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి తెలిపారు. అత్యవసర సమయాలలో అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం ఇటీవలే 213 నూతన అంబులెన్స్ లను ప్రజలకు అంకితం చేసిందని గుర్తు చేశారు. మరో 85 వరకు అంబులెన్సులను అందుబాటులోకి తెస్తామని వివరించారు. 102 అమ్మఒడి వాహనాలు కూడా ఆయా ప్రాంతాలకు సమకూరుస్తామని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు వీలుగా జాతీయ రహదారులపై ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని, వాటికి అంబులెన్స్ లను అనుసంధానం చేస్తామని తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు క్యాన్సర్ చికిత్స కేంద్రాలతో పాటు వాస్కులర్ యాక్సెస్ సెంటర్ లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తించామన్నారు. వైద్య సేవల కోసం పేద ప్రజలు అప్పుల పాలు కాకుండా, అభద్రతా భావానికి గురికాకుండా అన్ని విధాలుగా ఆరోగ్య భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని అన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందేలా ప్రతి చోట సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా 90% వరకు ఖాళీలను భర్తీ చేస్తున్నామని మంత్రి వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుండి 10 లక్షల రూపాయల వరకు పెంచుతూ, అనేక రకాల చికిత్సలను కొత్తగా ఆరోగ్యశ్రీ జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. అదనపు లేబరేటరీలను ఏర్పాటు చేస్తూ, డ్రగ్ ఇన్స్పెక్టర్లు, ఫుడ్ ఇన్స్పెక్టర్లను నూతనంగా నియమిస్తున్నామని వివరించారు. అవసరం అయిన చోట ఐవీఎఫ్ సెంటర్లను కూడా నెలకొల్పుతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా సంక్షేమం, వారి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ముందుకెళ్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు అండదండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషన్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, ఆరోగ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లాను వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలి

(మొదటి పేజి తరువాయి)

నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. నిజామాబాద్ లోని జిల్లా జనరల్ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. రోగులను పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్ లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో వైద్య సేవల స్థితిగతులపై వివిధ విభాగాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగం వారీగా జీజీహెచ్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఇంకనూ అవసరమైన సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది ఖాళీలు, వైద్య పరికరాల ఆవశ్యకత గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మంత్రి దృష్టికి తెచ్చారు. సదుపాయాలను మెరుగుపరుస్తూ, ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సమీక్షలో పాల్గొన్న జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ గుప్త, రాకేష్ రెడ్డి తదితరులు కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. జీజీహెచ్, ఎంసీహెచ్ ఆసుపత్రులలో బోరు మోటార్ల ఏర్పాటుకు అవసరమైన వ్యయాన్ని తన నియోజకవర్గ కొత్త నిధుల నుండి మంజూరు చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సమీక్ష సందర్భంగా ప్రకటించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, వైద్య సేవల విషయంలో నిజామాబాద్ జిల్లాకు ఇదివరకు ఎంతో మంచి పేరు ఉండేదని, ప్రస్తుతం కూడా వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావం, నిబద్దతతో పనిచేస్తూ పూర్వ ప్రతిష్టను పునరుద్ధరింపజేయాలని సూచించారు. ప్రభుత్వపరంగా ఎన్ని సదుపాయాలు కల్పించినా, వైద్య సేవల్లో లోపాలు ఉంటే ప్రయోజనం శూన్యంగా మారుతుందన్నారు. పేదలకు మెరుగైన సేవలు అందించడమే పరమావధిగా ప్రతి ఒక్కరు సేవా తత్పరతతో విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని హితవు పలికారు. ప్రభుత్వ వైద్యులు విధులకు ఎగనామం పెట్టి ప్రైవేట్ క్లినిక్ లు, ప్రైవేట్ ప్రాక్టీస్ లకు పరిమితమైతే సహించే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో నిర్వహణపరమైన లోపాలను సరిదిద్దుకుని, వచ్చే ఉగాది నాటికి వంద రోజుల్లోపు పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించేలా అంకితభావంతో పని చేయాలని సూచించారు. సబ్ సెంటర్ మొదలుకుని జిల్లా ఆసుపత్రులు, జీజీహెచ్ హాస్పిటల్ కు అవసరమైన అన్ని సదుపాయాలు తక్షణమే సమకూరుస్తామని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేసి అధునాతన వైద్య పరికరాలను మంజూరు చేస్తామని అన్నారు. ఆయా ప్రాంత ప్రజల అవసరాలు, దూర భారం తదితర అంశాలను బట్టి రాష్ట్రంలో ఎన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందాలన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తిస్తే సర్కారీ దవాఖానాల పట్ల ప్రజల్లో భరోసా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల వారు హైదరాబాద్ కు వెళ్లేందుకు దూరభారమైనందున మధ్యస్థంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యారోగ్య శాఖ పనితీరులో మార్పు రావాలని, నిజామాబాద్ జిల్లాను వైద్య సేవల హబ్ గా తీర్చిదిద్దాలని మంత్రి ఉద్బోధించారు. మందుల కొరత, వైద్య సేవలలో నిర్లక్ష్యం అనే ఫిర్యాదులు లేకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాకు వాస్కులర్ యాక్సెస్ సెంటర్, ట్రామా కేర్ యూనిట్, క్యాన్సర్ చికిత్స కేంద్రాన్ని వచ్చే మూడు, నాలుగు నెలల వ్యవధిలోనే మంజూరు చేసేందుకు చొరవ చూపుతానని తెలిపారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డీఎంఈ డాక్టర్ వాణి, అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రికి ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రజాప్రతినిధులు

హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లను జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు.

## కామారెడ్డిలో రెండో రోజు ఘనంగా మల్లన్న ఉత్సవాలు

**సూర్య కామారెడ్డి**



కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లిలో ఆదివారం ఉదయం మల్లన్న ఉత్సవాలు రెండవ రోజులో భాగంగా మల్లన్న దేవునికి పూజలు చేసిన అనంతరం గ్రామంలోని ఊరడమ్మ, నల్ల పోచమ్మ,ముత్యాలమ్మ, పెద్దపురం మల్లయ్య, బీరప్ప స్వామి, ఎల్లమ్మ, బంగారు మైసమ్మ, పోతు లింగయ్య, కట్ట మైసమ్మ, గంగమ్మ, బుసత్తవ్వ, శివాలయం, హనుమాన్ మందిరం లలో కొబ్బరికాయలు కొట్టి మల్లన్న ఉత్సవాలు సవ్యంగా సాగాలని,ఊరంతా సుఖ శాంతులతో ఉండాలని గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు వేడుకున్నారు.సాయంత్రం పురోహితులు పత్తిరి చెట్టుకు పూజ చేసి అగ్నిగుండాలకు ఏర్పాటు చేయనున్నారని వారు తెలిపారు.దేవునిపల్లి VDCఅధ్యక్షుడు గుడేల్లి గంగారాంఉపాధ్యక్షులు వంగ రాహుల్ కుమార్, నిట్టు లింగారావుప్రధాన కార్యదర్శి నవీన్ కుమారకోశాధికారి నాగల్లం స్వామి(ధోని)సభ్యులు మీసాల నవీన్,శ్రీను, బోడొల్ల రాజేందర్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేసిన మాల మహానాడు నాయకులు

**సూర్య రెంజల్**



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినటువంటి అమిత్ షా ను మంత్రి వర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ ఎదుట అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...అంబేద్కర్ ను అవమాన పరిచిన అమిత్ షా మంత్రి వర్గం నుండి భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. భారత దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని,లేనియెడల దళితుల నుండి భారీ మూల్యం చెల్లించక తప్పదు అన్నారు.అమిత్ షా అహంకా రానికి నిదర్శనమని, ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికయ్యారని, భారత రాజ్యాంగం ప్రకారం ఎంపీగా ఎన్నికై,కేంద్ర మంత్రిగా చలామణి అవుతు న్నారంటే ఆయన పుణ్యమే అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు దైరీ సాయిలు, బొగిడి రవి, పోతరాజు మదన్, దేవరాజు,గైని కిరణ్, ఆనంద్, అబ్బయ్య,ప్రభాకర్, ప్రసాద్,గంగాధర్, సాయిలు, మహేందర్, శివకుమార్, రమేష్,నారాయణ,భూమయ్య,నాగరాజు,సంతోష్ పాల్గొన్నారు.

## జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలిగా గౌతమి

**సూర్య నిజామాబాద్ రూరల్**



2025 సంవత్సరానికి గానూ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసిఐ) ఇందూర్ నూతన అధ్యక్షురాలిగా గౌతమి పెందోటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన జేసిఐ ఎన్నికల సమావేశంలోక్లబ్ ప్రతినిధులు గౌతమిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా కార్యదర్శిగా జైపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు..ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు గౌతమి మాట్లాడుతూసమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేస్తామని చెప్పారు.ముఖ్యంగా యువతకు విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని పేదల కోసం సేవా కార్యక్రమాలు చేస్తామని ఆమె వివరించారు. త్వరలోనే పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.ఎన్నికల సమావేశంలో జేసిఐ ఇందూర్ పూర్వాధ్యక్షులు బంగారి వీరబ్రహ్మం, వెంకటరమణ గౌడ్, విజయానంద్, లావణ్య, చంద్రశేఖర్, యాదేశ్ గౌడ్, సభ్యులు స్వరూప్ కుమార్,జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్‌కు బయలుదేరిన జూనియర్ బాలికల కబడ్డీ జట్టు

**సూర్య ఇందూరు**



ఈ నెల 22 నుండి 25 తేదీలలో 50వ జూనియర్ అండర్ 20 ఇయర్స్ బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్షిప్ జరిగే టోర్నమెంట్ కు నిజాంబాద్ జిల్లా కబడ్డీ జట్టు ఈరోజు ఉదయం 8 గంటలకు బయలుదేరడం జరిగినది . నిజాంబాద్ జిల్లా జట్టుకు క్రీడా దుస్తులను రేంజర్ శ్రీనివాస్ పంపిణీ చేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ అంజయ్య వి డి సి ప్రెసిడెంట్ రమేష్, కొమ్ముల నర్సయ్య మునీరుద్దీన్ రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపీనాథ్,ఏలేటి గంగారెడ్డి స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు గంగారాం, కనకయ్య దినేష్, రాము, పిడి రాజ్ కుమార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ బియ్యం పక్కదారి

## - అమాయకుల అవసరాలతో చెలగాటం
## - పెర్కిట్ కేంద్రంగా కొనసాగుతున్న అక్రమ వ్యాపారం

**సూర్య, ఆర్మూర్ ప్రతినిధి**

దారిద్ర రేఖకు దిగనున్న కుటుంబాలను ఆదుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. నిత్యము నిఘా ఏర్పాటు చేసి నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని అంటున్నారు. కంటి తుడుపు చర్యలతో సరి పెడుతున్నారని విమర్శిస్తున్నారు. ప్రతినెల 1వ తేదీ నుండి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం ప్రైవేట్ వ్యాపారులు గద్దల్లాగా వచ్చి తన్నుకు పోతున్నారు. అమాయకుల అవసరాలను "అసరా" చేసుకుంటున్న వ్యాపారులు తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసుకుని ఎక్కువ లాభానికి ప్రైవేట్ మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. దీనిని నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారని పేర్కొంటున్నారు. రేషన్ షాపుల్లో నుండి నేరుగా ప్రైవేట్ వ్యక్తుల




వద్దకు బియ్యం చేరుకుంటుంది. గత శుక్రవారం రాత్రి రేషన్ బియ్యం తరలిస్తుండగా హెన్ఫోర్స్మెంట్ అధికారులు పట్టుకున్న సందర్భం నిదర్శనంగా నిలుస్తుంది. పెర్కిట్ గ్రామంలోని మహమ్మదీయ కాలనీ సమీపంలో సుమారు 210 క్వింటాళ్ల, 50 కిలోలు సుమారు 7 లక్షల 57 వేల 800 విలువ కలిగిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎన్ఫో ర్స్ మెంట్ డీఎస్పీ వినోద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐచర్ డ్రైవర్ షేక్ జాకీర్, క్రికెట్ గ్రామానికి చెందిన నజ్జా, మధనం ఎల్లయ్యలకు సంబంధించిన వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పిడిఎస్ బియ్యాన్ని మహారాష్ట్రలోని ధర్మాబాద్ కు చెందిన రవుఫ్ అనే వ్యక్తి వద్దకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ఐచర్ వాహనంతో పాటు 4 ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని నిత్యం అక్రమంగా తరలిస్తున్న రవాణాపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రేషన్ షాప్ యజమానులే ఈ అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అమాయకులైన లబ్ధిదారులకు ఎంతో కొంత ముట్ట చెప్పి బియ్యాన్ని తీసుకుంటున్నారు. దీంతో వ్యాపారులు అధిక లాభాలు గడిస్తున్నారు. రేషన్ బియ్యం నివారణ కోసం ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ అక్రమ రవాణా మాత్రం సాగుతూనే ఉంది. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమార్కుల చేతిలోకి వెళ్లకుండా అడ్డుకట్ట చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## జంగంపల్లి చెరువు నుండి రైతులకు సాగునీటి విడుదల


**సూర్య- బిక్కనూర్**



మండలంలోని జంగంపల్లి పెద్ద చెరువు నుండి ఆయకట్టు రైతుల కోసం సాగునీటిని ఆదివారం అఖిలపక్ష నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ చెరువు కట్ట కింద ఉన్న ఆయకట్టు రైతుల కోసం చెరువు నుండి నీటిని విడుదల చేయడం జరిగిందని, ఆయకట్ట రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సొసైటీ ఛైర్మెన్ గాండ్ల సిద్ధరాములు, వైస్ చైర్మన్ వాసు యాదవ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు పుల్లూరి శివలింగం,రాంలు, రమేష్, రవి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మమత సత్యం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నరేష్, బాబు,బీజేపీ పార్టీ అధ్యక్షు డు నరేందర్, ప్రవీణ్ రైతు అధ్యక్షులు వెంకయ్య యాదవ్,బారాస అధ్యక్షులు బాల్ చెంద్రం,రాంలు,పోచయ్య, రమేష్,బాలన్న పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ త్వరగా అమలు చేయాలి

**సూర్య రెంజల్**



ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలు చేయాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రారంభోత్సవానికి విచ్చేసినటువంటి మంత్రికి ఎమ్మార్పీఎస్ నాయకులు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ త్వరగా అమలు చేయాలంటూ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసిం గారి భూమయ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఎస్సీ రిజర్వేషన్లు 59 షెడ్యూల్ కులాలకు వారి జనాభా నిష్పాతి ప్రకారంగా వర్గీకరణ చేయాలంటూ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## 5 లక్షల చెక్కు అందజేత

**సూర్య రాజంపేట**



రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొకిరే మంజుల కరెంట్ షాక్ వల్ల ప్రమాదానికి గురైన నేపథ్యంలో, ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ ద్వారా 5 లక్షల చెక్కును ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సల్మాన్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బీరయ్య, నాయకులు ఎల్లేశం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధుల సానుభూతి, సహాయం మంజుల కుటుంబానికి మద్దతుగా నిలిచింది.

## అరట్టు సందర్బంగా పండ్ల పంపిణి

**సూర్య నిజామాబాద్ రూరల్**



అరట్టు సందర్భంగా శ్రీ రవితేజ యూత్ సొసైటీ అధ్యక్షులు నీలగిరి రాజు ఆధ్వర్యంలో ఆదివారం పండ్లు మరియు నీళ్ల బాటిల్స్, పండ్ల జ్యూస్ బాటిల్స్ అయ్యప్ప స్వాములకు పంపిణి చేయడం జరిగింది ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తర్ల రమేష్ స్వామి, కోశాధికారి గైని మహేందర్, ఉపాధ్యక్షులు గైని దయసాగర్, మహిపాల్, రుద్ర శ్రీను, భరత్ చౌదరి (మమ్ము )బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## రామ మందిర ధ్వజస్తంభ కార్యక్రమంలో పాల్గొన్న వినయ్ రెడ్డీ

**సూర్య మాక్లూర్**



మండలంలోని ధర్మోర గ్రామంలో ఆదివారం రామ మందిర ధ్వజ స్తంభ కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన వినయ్ రెడ్డీ కీ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు,ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవి ప్రకాష్,విండో చైర్మెన్ అశోక్,ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా, చిన్న రెడ్డీ, భరత్, విఠల్ పాల్గొన్నారు.



## బల్దియా ఇంటి దొంగలను తక్షణమే గుర్తించాలి

### - సిపిఐ ఏఐటియుసి డిమాండ్

**సూర్య కామారెడ్డి**




కామారెడ్డి బల్దియాలో ఇంటి దొంగలపై జిల్లా కలెక్టర్ గారు మరియు కామారెడ్డి మున్సిపల్ లో జరుగుతున్న అవినీతిపై స్పెషల్ ఆఫీసర్లకు అప్పజెప్పాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కామారెడ్డి జిల్లా కమిటీ మరియు ఏఐటీయూసీ కామారెడ్డి జిల్లా డిమాండ్. ఈ సందర్భంగా ఏఐటీయూసీ. సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాది వి.ఎల్ నరసింహారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి బాలరాజు సిపిఐ జిల్లా నాయకులు ఎం దేవయ్య బత్తుల ఈశ్వర్ ఎం మల్లేష్ సాయిలు కాసిం రాజమణి పుష్పలత శ్యామల నజీర్ లక్ష్మణ్ రాజిరెడ్డి రాజు భీమ్ శ్రీనివాస్ వారు డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్యాలయంలో అవకతవకల పైన చర్య తీసుకుని బాధ్యులను క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.లేని యెడల మున్సిపల్ కార్యాలయం అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని మున్సిపల్ వాటర్ వర్క్స్ సెక్షన్ లో భార్యలు కౌన్సిలర్లు అయితే భర్తల ఆధిపత్యం కొనసాగుతుందని వారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు కామారెడ్డి మున్సిపల్ పై ఒక స్పెషల్ ఆఫీసర్ నియమించాలని వారు డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మదన్ మోహన్

**సూర్య నాగిరెడ్డి పేట్**



మండలంలోని పోచారం గ్రామానికి చెందిన టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి రైతు ఇటీవల గుండెపోటుతో మరణించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదివారం పోచారం గ్రామానికి చేరుకొని మృతుడు శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.మనోధైర్యంతో ముందుకు సాగాలని కుటుంబ సభ్యులను ధైర్యం నింపారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు,రామచంద్రారెడ్డి, వాసురెడ్డి, విట్టల్ రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

**సూర్య రెంజల్**

అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ ను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని నీలా శివారులో శనివారం సాయంత్రం వేళ ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. బోధన్ మండలంలోని కొప్పర్గ గ్రామం నుండి నీలా మీదుగా వస్తున్న టిప్పర్‌కు ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్ తరలించడం జరిగిందని, రెంజల్ తాహసిల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే మదన్ మోహన్


**సూర్య నాగిరెడ్డి పేట్**



మండలంలోని తాండూర్ సొసైటీ చైర్మన్ అకిడి గంగారెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుక ఆదివారం జరిగింది. ఈ వేడుకకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హాజరై కాబోయే వధూవరులకు ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు,రామచంద్రారెడ్డి, వాసురెడ్డి, విట్టల్ రెడ్డి, బాల్ రెడ్డి, గంపల వెంకయ్య, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి

**సూర్య, లింగంపేట్**



లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన వన్నెపల్లి రాజు 55 అనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు.మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన అంత్యక్రియలను ఆదివారం లింగంపేట్ మండల కేంద్రంలో నిర్వహించారు.

## బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్మన్

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్ గ్రామంలో బోరంచ పోచమ్మ అమ్మవారికి నూతనంగా గుడి నిర్మించిన సందర్భంగా ఆదివారం శ్రీ బోరంచ పోచమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవాలు ఆటపాటలతో, భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పాల్గొని పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శ్రీ బోరంచ పోచమ్మ అమ్మవారికి మొక్కుకున్నారు. వీరితో పాటు ఎల్లారెడ్డి మండల యూత్ ఉపాధ్యక్షులు కిరణ్, మాజీ జడ్పీటీసీ సామెల్, గ్రామ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గురుప్రతాప్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగం శంకరయ్య, అశోక్ రెడ్డి, కాశీరామ్, గ్రామ యూత్ అధ్యక్షులు మహ్మద్ నజీర్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ గౌడ్, ఉపాధ్యక్షులు మహేష్, భీమయ్య, కాశీరామ్, మల్లయ్య, వెంకటరమణ, బలరాం, హైమద్ పాష, రజాక్, కాసిం, హైమద్, జమల్, జానీయా, కాసిం, గౌస్, సాయగౌడ్, రాజశేఖర్, గణేష్, వడ్ల రమణ, బుడిగేల రవీందర్, రాజిరెడ్డి, మొగులగౌడ్, చెన్నపు మహేందర్, రాజులు, గంగి రవి, గంగారాం, సతీష్, నిరంజన్ రెడ్డి, కిషన్, కమ్మరి సాయిలు, అరుణ్ రెడ్డి, అకలంకేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.

# ఉపాధికూలీలతో పాటు అన్ని రకాల వ్యవసాయ కూలీలకు ఆసరా భృతి అందించాలి

**- కొంతమందికె ఆసరా భృతి ఇవ్వడమంటే ఎగనామం పెట్టడమే**

**- అందరికి ఆసరా ఉపాధి హామీ కూలీలతో పాటుభృతికోసం పెద్దఎత్తున ఆందోళన**

**సూర్య కామారెడ్డి**

అన్నీ రకాల వ్యవసాయ కూలీలకు అందరికి ఆసరా భృతి అందించాలని - అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (AIP-KMS)లి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి P.రామకృష్ణ డిమాండ్ చేశారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం నాడు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 12వేల ఆసరా భృతిని 6వేల చొప్పున రెండూ విడతలుగా కూలీలకు ఈ నేల 28నుండి ఇవ్వనున్నట్టు ప్రకటించడం హార్శించదగ్గ విషయం అని కానీ కండిషన్ గా 100రోజులు పని చేసిన ఉపాధి కూలీలకే ఇస్తాం అనడం అమోదించదగిన విషయం కాదు అన్నారు.




ఉపాధికూలీలు కాకుండా వ్యవసాయ రంగంలో కూడా అనేక పనులు చేసే కూలీలు ఉన్నారు అని వీరికి కూడా ఆసరా భృతిని అందించాలి అని అయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 51 లక్షలు ఉన్నాయని ప్రభుత్వమే చెప్తుంది అని కానీ 100రోజులు పని చేసిన వారికే ఇవ్వాలని, భూమిలేని కూలీలకే ఇస్తాం అనడమంటే కూలీలకు మొండి చెయ్ చూపడమేనన్నారు. వందరోజులు ఉపాధి పనిచేసినవారు 25వేలు ఉన్నారని ప్రభుత్వం అంటుంది అని మరి వ్యవసాయ కూలీలను ఎందుకు గుర్తించడం లేదు అని ఆయన ప్రశ్నించారు. ఉపాధి, వ్యవసాయ కూలీ అని విభజించి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలి అని చూస్తుంది అన్నారు. వ్యవసాయ కూలీలను విస్మరించడం అంటే ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే నన్నారు. అన్నీ రకాల కూలీలకు ప్రభుత్వం తక్షణమే ఆసరా భృతిని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాపితంగా పెద్దఎత్తున ఆందోళనకు పూనుకుంటాం అని ఆయన హేచ్చరించారు. ప్రెస్ మీట్లో CPI(ML) మాస్ లైన్ కామారెడ్డి జిల్లా నాయకులు ఏ ప్రకాష్, పి డి ఎస్ యు రాష్ట్ర కోశాధికారి జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల నిబంధనలు యధాతథం


**- కొందరి అభ్యర్థుల ఆశలపై నీళ్లు - సై అంటున్న పలువురు పార్టీల నేతలు**

**సూర్య కామారెడ్డి**

ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన తెలంగాణలో కొనసాగనుంది. ఈ నిబంధనను మార్చాలని వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి మండలి తిరస్కరించింది. పాత నిబంధననే కొనసాగించాలని పంచాయతీ రాజ్‌ను ఆదేశించింది. దీంతో శాసన సభలో ప్రవేశపెట్టిన బిల్లులో దీనికి సవరణ చేయలేదు. ఇతర అంశాలతో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి రాష్ట్రంలో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు పురపాలక, పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులని చట్టం చేశారు. ప్రస్తుతం కుటుంబ నియంత్రణ పై అవగాహన పెరిగినందుకు పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. దీనికి కొందరు మంత్రులు హామీ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ.. చట్టసవరణ ప్రతిపాదనల్లో ఈ అంశాన్ని చేర్చి మంత్రిమండలి ఆమోదానికి పెట్టింది. దీనికి మంత్రిమండలి అనుమ తించలేదు. తెలంగాణలో సంతానోత్పత్తి రేటు పై శాస్త్రీయ ఆధారాలు లేకపోవడం, నిబంధన మార్పును కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తాయనే కారణం తో ఈ ప్రతిపాదనను నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ ఒక్కటి మినహా మిగిలిన అన్ని ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించింది. దీనికి అనుగుణంగా చట్టసవరణ బిల్లును రూపొందించి పంచాయతీరాజ్ శాఖ బిల్లును ప్రవేశపెట్టింది. మొన్నటి వరకు ఆశా వహులుగా ఉన్న వ్యక్తులకు ఈ ప్రకటనతో నిరాశే మిగిలినట్లయింది. గ్రామీణ స్థాయిలో పోటీ చేసే వారికి కనీస విద్యా అర్హతలైనా పాటిస్తే చట్టాల అమలు పై అవగాహన ఉండే దని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ఆశావహులుగా ఉన్న వ్యక్తుల్లో నిరాశే మిగిలింది. స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కనీస విద్యార్హత ప్రకటిస్తే చట్టాల పట్ల విధుల పట్ల కనీస అవగాహన ఉంటుందని కొందరి అభిప్రాయం.

## పంచాయతీ ఎన్నికలు నిబంధనలు యధాతథం

**సూర్య రాజంపేట**



ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన తెలంగాణలో కొనసాగనుంది. ఈ నిబంధనను మార్చాలని వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి మండలి తిరస్కరించి పాత నిబంధననే కొనసాగించాలని పంచాయతీ రాజ్ శాఖను ఆదేశించింది. 1994లో ఉమ్మడి రాష్ట్రంలో కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ చట్టాన్ని అమలు చేశారు. అయితే, గత కొంతకాలంగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ నిబంధనను సవరించాలని కోరుతున్నారు. తెలంగాణలో సంతానోత్పత్తి రేటు తగ్గుముఖం పట్టినప్పటికీ, ఈ మార్పుకు శాస్త్రీయ ఆధారాలు లేకపోవడంతో పాటు, కొన్ని వర్గాలు వ్యతిరేకించే అవకాశం ఉందనే కారణంతో మంత్రిమండలి ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. దీంతో, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లులో ఈ అంశాన్ని చేర్చకుండా మిగతా ప్రతిపాదనలతోనే బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. కానీ, ఈ నిబంధనలో మార్పు చేస్తే గ్రామీణ స్థాయిలో పోటీ చేసే వారికి మంచి అవకాశం కలిగించి, ప్రజాప్రతినిధుల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, కనీస విద్యార్హతల నిబంధనను అమలు చేస్తే చట్టాలపై అవగాహన పెరుగుతుందని కూడా కొందరు సూచిస్తున్నారు.ఈ నిర్ణయం పట్ల ఆశావహులలో నిరాశ వ్యక్తమవుతుంది. వారి అభిప్రాయం ప్రకారం, పంచాయతీ ఎన్నికల నిబంధనలను సవరించడం ద్వారా స్థానిక సంస్థల్లో బాధ్యతాయుతమైన నాయకత్వానికి అవకాశమిస్తే గ్రామీణ అభివృద్ధి మెరుగవుతుందని భావిస్తున్నారు.

## బీసీ జాతీయ నాయకుడు ఆర్ కృష్ణయ్యను శాలువాతో సన్మానం చేసిన కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ నేత


**సూర్య ఎల్లారెడ్డి**



జాతీయ బిసి నాయకుడు ఆర్ కృష్ణయ్యను కామారెడ్డి జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ నేత ఆదివారం హైదరాబాద్లోని బీసీ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు, ఢిల్లీ నుండి జాతీయ బీసీ నాయకుడు ఆర్ కృష్ణయ్య హైదరాబాద్కు వచ్చిన సందర్భంగా ఆయనను ఆదివారం కలిసి శాలువాతో సత్కరించి, పూల బోకెను అందించారు అనంతరం ఆర్ కృష్ణన్నతో కాసేపు ముచ్చటించారు, మరి జిల్లాల విషయాలను అడిగి తెలుసుకున్నారు రాజ్యసభ పదవి వచ్చినందుకు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మరియు బీసీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

## కరెంటు ప్రమాదంలో మృతి చెందినబాధిత కుటంబానికి ఐదు లక్షల చెక్కును అందించిన ఎమ్మెల్యే మదన్ మోహన్

**సూర్య ఎల్లారెడ్డి**



ఇటీవల ప్రమాద వశత్తు కరెంట్ షాక్‌కు గురై రాజంపేట మండలం ఎల్లారెడ్డి పల్లి గ్రామనికి చెందిన మొకిరే ఎల్లయ్య చనిపోయారు. ప్రమాదంలో మరణించిన మొకిరే ఎల్లయ్య కుటంబానికి ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ ద్వారా ఐదు లక్షల చెక్కును ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ చేతుల మీదు అతని భార్య కు ఐదు లక్షల చెక్కును అందజేశారు.ఇంతత్వరగా ఆర్థిక సహాయం అందడానికి చోరువచుపిన ఎమ్మెల్యే మదన్ మోహన్ కు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక్య కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు సల్మాన్, మండల బిసి సెల్ ఉపఅధ్యక్షులు బీరయ్య, ఎల్లేశం, మల్లేష్,మండల నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## బీ ఆర్ ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్, బీజేపి నాయకులు

**- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో చేరిక**

**సూర్య, నాగిరెడ్డిపేట్**



నాగిరెడ్డి పేట్ మండలంలోని వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ, బీజేపి పార్టీ నాయకులు,కార్యకర్తలు పార్టీలను వీడి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ సమక్షంలో వీరు పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే సురేందర్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే అప్పుడే కాంగ్రేస్ ప్రభుత్వం పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి నూతన అభివృద్ధి పనులు మంజూరు చేసిన దాఖలాలు లేవని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు, జైలుకు పంపే కార్యక్రమం మాత్రం జరుగుతుందనీ ఆయన విమర్శించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలవ్వడం ఖాయమన్నారు. అనంతరం నాగిరెడ్డి పేట్ మండల బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య ఆధ్వర్యంలో వాడి గ్రామానికి చెందిన సుమారు 50 కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు బీఆర్ ఎస్ పార్టీలో చేరినట్టు పార్టీ నాయకులు తెలిపారు.

## ప్రభుత్వం ఇచ్చిన మెను ప్రకారమే భోజనం అందించాలి

**- బాన్సువాడ ఆర్డీఓ & సబ్ కలెక్టర్ కిరణ్మయి**

**పెద్ద కోడప్‌గల్**

ప్రభుత్వం ఇచ్చిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి అని బాన్స్వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. ఆదివారం రాత్రి మండల కేంద్రం లోని బాలుర హాస్టల్ ను తనిఖీ చేసారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మంచి చదువు ను అందించాలి అని అధికారులకు సూచించారు. విద్యార్థులకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి భవిష్యత్తు లో తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, హాస్టల్ సిబ్బంది పాలొగొన్నారు.

## మదర్సాలో మైనర్ విద్యార్థిని అదృశ్యం

**- సంబంధం లేని సమాధానాలు చెప్తున్న ప్రిన్సిపాల్ షేక్ మౌలానా**

**సూర్య కామారెడ్డి**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మదర్సాలో మైనర్ విద్యార్థిని శనివారం అదృశ్యమైనట్లు సమాచారం. ఈ విద్యార్థిని సుమారు 12, 13 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని ఈమె కామారెడ్డి మండలనికి చెందిన ఓ గ్రామానికి చెందిన బాలికగా స్థానికులు పేర్కొంటున్నారు. మదర్సాలో మైనర్ బాలిక అదృశ్యం కవడంతో పట్టణంలోని విద్యార్థినిల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. జీవధాన్ ఘటన మరువక ముందే మరో ఘటన తేరపైకి రావడంతో విద్యార్థినిల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపన్న వద్ద అన్న సందిగ్ధంలో పడిపోతున్నారు. ఈ బాలిక అదృష్టమైనప్పటికీ అటు విద్యా శాఖ అధికారులకు ఫిర్యాదులు అందకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. పాఠశాల ఆవరణంలో సిసి కెమెరాలు లేకపోవడంతో ఎవరు వస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో సమాచారం ఏమి ఉండక పోవడంతో జరిగిన విషయాలు తెలియకుండా ఉన్నాయి. శనివారం సైతం ఆటోలో సదరు విద్యార్థిని పాఠశాలకువచ్చినట్లు గా ప్రిన్సిపాల్ షేక్ మౌలానా పేర్కొన్నారు.ఈ బాలిక ఎలా అదృశ్యం అయిందో తెలువదని ప్రిన్సిపాల్ షేక్ మౌలానా అన్నారు.

**- నిద్రావస్థలో విద్యాశాఖ అధికారులు**

విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఈ ఘటన చూస్తే అర్థమవుతుంది. ప్రవేట్ విద్యా సంస్థల యజమానులు కొందరు వారి పాఠశాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇలాంటి సంఘటనలు ఎదురవుతున్నాయి.

**- ఆటోలో వచ్చినట్టు తెలుస్తోంది మదర్స ప్రిన్సిపల్**

ఈ విషయంపై మదర్సా ప్రిన్సిపల్ షేక్ మౌలానాను వివరణ కోరగా పాఠశాల కు విద్యార్థులు వచ్చే సమయం గడిచిపోయిన తర్వాత అమ్మాయి కనిపించకపోవడంతో వారి ఇంటికి ఫోన్ చేశామని అక్కడికి వారు రాలేదని చెప్పడంతో స్థానికంగా పాఠశాలలో విచారించగా ఆటో లో మదర్సా వద్దకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఎలా వెళ్ళిందో అనే సమాచారం లేదని పాఠశాల ప్రిన్సిపల్ తెలపడం అనుమానాలకు తావిస్తోంది.

**- మదర్సాలకు ఎలాంటి అనుమతులు లేవు -ఎంఈఓ ఎల్లయ్య**

విద్యార్థిని అదృశ్య విషయమై ఎంఈఓ ఎల్లయ్య వివరణ కోరగా మదర్సాలకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు.